క్లుప్తంగా

50 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేసి సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: స్థానిక ఆదిత్య కళాశాలలో అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఏరియా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అన్నపూర్ణ, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డి.కాశీ విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. రక్తదానం అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

నేడు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

యానాం: ఈ నెల 1వ తేదీ ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కనకాలపేట ఫ్లడ్ బ్యాంకు రహదారిని శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

రేపు మద్యం షాపులు మూసివేత

యానాం: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 2న యానాం నియోజకవర్గ పరిధిలోని అన్ని మద్యం షాపులను మూసివేయాలని ఆదేశించినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎం.మాథ్యు ఫ్రాన్సిస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.50 వేలు ఆర్థిక సాయం



కామేశ్వరరావు సోదరికి ఆర్థిక సాయం అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పూర్వపు విద్యార్థికి స్థానిక వెంకటేశ్వర కళాశాల యాజమాన్యం, విద్యార్థులు ఆర్థిక సాయం చేశారు. కళాశాల పూర్వ విద్యార్థి మార్లపూడి కామేశ్వరరావుకు రోడ్డు ప్రమాదంలో వెన్నెముక విరగడంతో ప్రస్తుతం కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో వైపు కామేశ్వరరావు తండ్రి సైతం అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిద్దరికి వైద్య ఖర్చుల నిమిత్తం కళాశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసి రూ.50 వేలు సమకూర్చి కామేశ్వరరావు సోదరి సత్యవాణికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏవో కరాటం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

అమలాపురం టౌన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహార కిట్లను జన కళ్యాణ్ సొసైటీ సమకూర్చింది. స్థానిక వంటెద్దు వారి వీధిలో కోనసీమ దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు చేతుల మీదుగా శనివారం కిట్లను పంపిణీ చేశారు. కె.రిషిక్, వంటెద్దు నాయుడు కిట్లను సమకూర్చారు. కార్యక్రమంలో జనకళ్యాణ్ శ్రీనివాస్, జల్లి సుజాత, జి.అమల, ఎం.ధనలక్ష్మి, కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాసాహితీ వార్షికోత్సవం



కళాసాహితీ వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న సాహితీవేత్తలు

ముమ్మిడివరం: స్థానిక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో కళాసాహితీ 17వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా, డాక్టర్ బోయి భీమన్న, గురజాడ అప్పారావు, కాళోజీ, తాపీ ధర్మారావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సంఘ సంస్కరణ, సామాజిక అసమానతలు, రుగ్మతలు తొలగించడంలో సాహిత్యం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, పి.వి జయకుమార్, పి.లక్ష్మీశ్రీనివాస్, కన్నీడి వెంకటేశ్వరరావు, ఎన్.అబ్బులు, పీవీఎస్ వర్మ, విత్తనాల వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

22న ఉమ్మడి జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఈ నెల 22న తోరం రమేష్ మెమోరియల్ యునైటెడ్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి మూడు స్థానాల విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, ట్రోఫీ, నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌లో అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సమావేశమై పోటీల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో నగభేరి కృష్ణమూర్తి, దొమ్మేటి వెంకటరమణ, ఆశెట్టి ఆదిబాబు, గారపాటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ప్రారంభం



కొత్తలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం మండలంలోని కొత్తలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తున్నారన్నారు. ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, సర్పంచ్ గుత్తుల కల్యాణి, పెన్మత్స చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతుందని తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శనివారం మండల పరిధిలోని గోవలంక పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత, ఎంపీడీఓ ఎం.అనుపమ, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్ తదితరులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, స్థానిక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, ఎంపీటీసీలు మోర్త భీమాబాయి, కూరాటి శ్రీకృష్ణ, గాడిమొగ పీహెచ్‌సీ వైద్యులు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని సర్పంచ్ కుంచే చిట్టికుమారి అన్నారు. మండలంలోని ఎన్.కొత్తపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో 260 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నడింపల్లి వాసురాజు, బొడ్డు నాగేశ్వరరావు, కుంచే చిన్ని, అంగాని సాంబశివరావు, ఎంపీడీవో కేవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: పేదరికం కారణంగా నిరుపేదలు వారి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఉండేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. బోడసకుర్రు ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనిక్ విభాగాలకు చెందిన డాక్టర్లు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, జిల్లా వైద్య పరిపాలనాధికారి టీకే శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి కె.మూర్తి, డీటీ వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు అన్నారు. మండలంలోని ఎదుర్లంకలో శనివారం వైద్యురాలు కె.ఇందిరాశ్రీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి, జిల్లా వైద్యారోగ్య అదనపు అధికారి భరతలక్ష్మి, కంటి వెలుగు ఇన్‌చార్జి డాక్టర్ హేమలత శిబిరాన్ని పరిశీలించారు. శిబిరంలో 452 మందికి వివిధ రకాల వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీ కుమారి, సర్పంచ్ ముదునూరి పద్మ, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఎంపీడీఓ డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి అన్నారు. శనివారం తాండవపల్లి సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో 405 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో దుర్గారావుదొర పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్‌కే ఖాదర్, సర్పంచ్‌లు గుంగుమళ్ల ఏసుబాబు, రేలంగి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



గోవలంకలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ రాయుడు సునీత



జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు



ఎదుర్లంకలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



ఎన్.కొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ చిట్టికుమారి

స్వామినాథన్ ఆశయాలను నెరవేర్చాలి



స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తాళ్లరేవు: హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఏపీ కౌలు రైతు సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, కాకినాడ ఏఎంసీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావులు హాజరై స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ మాట్లాడుతూ దేశానికే కాకుండా ప్రపంచానికి ఆహార కొరత రాకుండా చేసిన మహోన్నత వ్యక్తి స్వామినాథన్ అని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, రైతులు పాల్గొన్నారు.

భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్త

ఐ.పోలవరం: ఎంఎస్ స్వామినాథన్ భారతదేశం గర్వించదగిన శాస్త్రవేత్త అని ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీధి సురేష్ బాబు అన్నారు. శనివారం హైస్కూల్‌లో నిర్వహించిన స్వామినాథన్ సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్వామినాథన్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరావు, దంగుడుబియ్యం నారాయణరావు, ఎఎస్ఎన్ మూర్తి, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిమజ్జనాలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మార్కెట్ సెంటర్, పల్లిపాలెం, గాడిలంకతో పాటు పలు గ్రామాల్లో స్వామివారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి ఊరేగింపుగా వృద్ధ గౌతమి గోదావరి పాయలో నిమజ్జనం చేశారు. గాడిలంక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో స్వామికి సమర్పించిన లడ్డూను గ్రామానికి చెందిన నగుబత్తుల బాల వెంకట సుబ్బారావు రూ.42 వేలకు దక్కించుకున్నారు. చింతలమెరకలో వరసిద్ధి వినాయక స్వామికి సమర్పించిన లడ్డూను నగర పంచాయతీ వైస్ చైర్మన్ రెడ్డి హేమసుందరి, శివన్నారాయణలు రూ.18,500కు దక్కించుకున్నారు.



చింతలమెరకలో వేలం పాటలో దక్కించుకున్న లడ్డూను తీసుకెళుతున్న రెడ్డి శివన్నారాయణ

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత

యానాం: యానాంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 95 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు ది సిటిజన్ కోపరేటివ్ సొసైటీ(సిటిజన్ బ్యాంకు) శనివారం ప్రతిభా పురస్కారాలను అందజేసింది. బ్రాంచ్ కార్యాలయంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సొసైటీ డైరెక్టర్ జె.సత్యనారాయణ, విశ్రాంత ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, పారిశ్రామికవేత్త ఈలప్రోలు విష్ణువర్ధనరావులు పాల్గొని విద్యార్థులు రాయుడు సూర్య యశ్వంత్, గోకవరపు లక్ష్మీపూర్ణిమ, మండవిల్లి వీర వెంకట షణ్ముక్, పెసల లీలా సత్యప్రసన్నలకు ఒక్కొక్కరికి రూ.10వేల నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ కాశి అశోక్‌కుమార్, ఖాతాదారులు పాల్గొన్నారు.

సీఐ రజనీకుమార్ సేవలు అభినందనీయం

జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్



సీఐ రజనీకుమార్‌ను సత్కరిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ బాషా తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్(ఎస్బీ) సీఐగా పనిచేసిన కోలా రజనీకుమార్ సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అన్నారు. అమలాపురం నుంచి ఏలూరు రేంజ్ డీఐజీ కార్యాలయానికి బదిలీ అయిన సీఐ రజనీకుమార్‌కు శనివారం రాత్రి స్థానిక ఎస్పీ కార్యాలయంలో అభినందన వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆవిర్భావం నుంచి ముగ్గురు ఎస్పీల వద్ద ఎస్బీ విభాగంలో సీఐ రజనీకుమార్ జిల్లాలో కీలకంగా పనిచేశారని గుర్తు చేశారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, అమలాపురం డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్‌లు మాట్లాడుతూ గత ఏడాదిన్నర కాలంలో జిల్లాలో పోలీసుశాఖ పరంగా ఎదురైన అనేక సవాళ్ల పరిష్కారంలో సీఐ రజనీకుమార్ సమర్థవంతంగా పనిచేశారని పేర్కొన్నారు. అనంతరం సీఐ రజనీకుమార్‌ను జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.

సమన్వయంతో ప్రజలకు సేవలందించాలి

వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు

కాట్రేనికోన: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా ప్రజలకు సేవలందించాలని వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశానికి అటవీశాఖ, పోలీసు శాఖలతో పాటు పలుశాఖల అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. దీనిపై వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవన్నారు. కందికుప్ప పీఏసీఎస్ అధ్యక్షుడు ఏడిది సుబ్బారావు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇల్లు కట్టుకున్న లబ్ధిదారుల నుంచి ఏటీఎస్ కట్టించుకున్నామని, వారి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కోసం తమను నిలదీస్తున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ సత్యనారాయణ స్పందిస్తూ ఓటీఎస్ డాక్యుమెంట్లు సిద్ధం చేశామని, త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. చెయ్యేరులో శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని సర్పంచ్ చెల్లి సురేష్ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, నాతి సత్యనారాయణ, గంటి వెంకట సుధాకర్, ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దార్ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు, సభ్యులు హాజరయ్యారు.

ర్యాగింగ్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అమలాపురం రూరల్: యువత ర్యాగింగ్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా రెండో అడిషనల్ జడ్జి వి.నరేష్ అన్నారు. శనివారం కిమ్స్ మెడికల్ కాలేజ్‌లో విద్యార్థులకు ర్యాగింగ్ దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెండో అడిషనల్ జడ్జి వి.నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు లోనవకుండా సామరస్యపూర్వకమైన జీవితాన్ని గడపాలని కోరారు. ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలను వివరించారు. అనంతరం జడ్జి నరేష్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, వైద్య విద్యార్థులు డాక్టర్ గోలకోటి రంగారావు, కటారి శివ ప్రసాద్, రేఖాకుమారిలు పాల్గొన్నారు.



జిల్లా రెండో అడిషనల్ జడ్జి నరేష్‌ను సత్కరిస్తున్న వైద్యులు

మండల పార్టీ అధ్యక్షుడిగా బాబ్జి



బద్రి బాబ్జి

ఉప్పలగుప్తం: వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడిగా చినగాడవిల్లి సర్పంచ్ బద్రి బాబ్జి రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆట పాటలతో చిన్నారుల సందడి

అమలాపురం టౌన్: స్థానిక మిరియాం స్కూలులో విద్యార్థుల తాతలు, నాన్నమ్మలు, అమ్మమ్మల సమక్షంలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం చిన్నారులు తమ పెద్దలతో కలిసి కరక్కాయపేటలో ఉన్న ఓల్డ్ ఏజ్ హోమ్‌కు వెళ్లి అక్కడి వృద్ధులతో మమేకమయ్యారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ సూకపెయ్యి ఆదిలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగదు, వస్త్రాల బహూకరణ



సంస్థ కార్యకర్తలకు నగదు, వస్త్రాలను బహూకరిస్తున్న మల్లాడి కృష్ణారావు

యానాం: యానాం పీపుల్స్ వాలంటీర్ సంస్థకు గత 25 ఏళ్లుగా సేవలందిస్తున్న కార్యకర్తలకు మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు చేతుల మీదుగా నగదు, వస్త్రాలను శనివారం పంపిణీ చేశారు. మొత్తంగా 286 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదును బహూకరించారు.

సురక్ష సర్వే పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష సర్వేను సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు శనివారం పరిశీలించారు. గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోరాటం ఉధృతం చేస్తాం

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం మరింత ఉధృతం చేస్తామని మాల మహానాడు(పీవీ రావు) జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో శనివారం జరిగిన మాల మహానాడు జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో అశోక్ కుమార్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ నిబంధనల ప్రకారం సాధ్యం కాదని తెలిసి కూడా కొందరు వర్గీకరణ చేయాలని పట్టుబట్టడం అర్థరహితమన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, మెండు రమేష్‌బాబు, గూటం సాయి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ ర్యాలీ

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు ఆదిత్య స్కూల్ విద్యార్థులు అమలాపురంలో స్వచ్ఛ భారత్ ర్యాలీ శనివారం నిర్వహించారు. ర్యాలీ పాఠశాల నుంచి ప్రారంభించి ఎర్రవంతెన, ఎన్టీఆర్ మార్గ్, నల్లవంతెన వరకూ సాగింది. ర్యాలీని ఉద్దేశించి ప్రిన్సిపాల్ రామ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అనేది సామాజిక బాధ్యతని, మన దేశాన్ని మనం సంరక్షించుకోవడానికి తోడ్పడుతుందని అన్నారు.

వృద్ధుల ఆశ్రయ సౌధం

- యానాం ఓల్డేజ్ హోమ్‌కు 25 వసంతాలు పూర్తి
- బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు



యానాం ఓల్డేజ్ హోమ్ భవనం

యానాం: 'నా కళ్లజోడంటే నాకు ఇష్టం.. నా చేతికర్రంటే నాకు మరింత ఇష్టం.. ఎందుకంటే.. నా బతుకంతా నేను వాటి మీద ఆధారపడ్డా అవి నన్ను అసహ్యించుకోవు నా కన్న కొడుకుల్లా'.. ఓ కవి రాసిన పలుకులివి.. కన్నబిడ్డల నిరాదరణకు గురైన తల్లిదండ్రుల హృదయవేదనకు అద్దం పడుతున్న మాటలవి. వృద్ధులు మన భారతీయ కుటుంబ వ్యవస్థకు ఆయువు పట్టు. నేటి తరాలకు మార్గదర్శకులు. కాని నేటి ఆధునిక సమాజంలో వాళ్ల చిరునామాలు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలుగా మారుతున్నాయి. అలాంటి వృద్ధులకు ఆసరాగా నిలుస్తున్న యానాం ఓల్డేజ్ హోమ్ ఆదివారం 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ‘సాక్షి’ అందిస్తున్న ప్రత్యేక కథనమిది..

ఆశా కిరణం యానాం ఓల్డేజ్ హోమ్

దిక్కులేని వయో వృద్ధులను అక్కున చేర్చుకుని తన వంతు సహాయపడాలనే ఆశయంతో 1998 అక్టోబర్ 2న మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు వ్యవస్థాపకులుగా యానాం ఓల్డేజ్ హోమ్ ప్రారంభించారు. ఎంతోమంది దాతల ఆర్థిక సహాయ సహకారాలతో నడుస్తూ ఎందరో వృద్ధులను అక్కున చేర్చుకుని ఆదరిస్తూ అందరి మన్ననలు పొందుతుంది. వృద్ధులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కలగజేస్తూ వారిని 24 గంటలు పర్యవేక్షిస్తూ సేదతీరేందుకు అవకాశం కల్పిస్తోందీ సంస్థ. ఈ సేవా కార్యక్రమాలు ఓల్డేజ్ హోమ్‌తో ఆగిపోకుండా ఇక్కడి నుంచే యానాం ప్రజల స్వచ్ఛంద సేవా సంస్థ, యానాం బ్లడ్ బ్యాంక్, యానాం ఐ–బ్యాంక్, యానాం చిన్నారుల ఆనంద నిలయం తదితర సంస్థలను ఏర్పాటుచేసి సుమారు 25 రకాల సేవలను యానాం పరిసర ప్రాంతాల ప్రజలకు అందివ్వడం అభినందనీయం.

యానాం బ్లడ్ బ్యాంక్

యానాం ఓల్డేజ్ హోమ్ కేంద్రంగా అత్యవసర సమయాల్లో బాధితులకు ఉచితంగా రక్తం ఇవ్వాలనే ఆశయంతో 2008లో యానాం బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. వందలాది మంది రక్తం దానం చేయడానికి ఇక్కడకు వస్తుంటారు.

యానాం ఐ–బ్యాంక్

అంధులకు తమ వంతు సహాయపడాలనే ఆశయంతో 2008లో సినీనటి జయప్రద చేతుల మీదుగా యానాం ఐ బ్యాంక్‌ను ప్రారంభించారు. చనిపోయిన తరువాత తమ కార్నియాలను దానం చేసేలా ప్రజల్లో చైతన్యం తేవడంతో పలువురు స్వచ్ఛందంగా కార్నియాలను ఇవ్వడానికి హామీ ఇస్తున్నారు.



అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డు స్వీకరిస్తున్న మల్లాడి

చిన్నారుల ఆనంద నిలయం

నాఅన్నవారు లేని అభాగ్య పిల్లలకు మంచి ఆహారం, ఆరోగ్యం అందిస్తూనే విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుతుంది యానాం చిన్నారుల ఆనంద నిలయం. వందలాది మంది చిన్నారులకు ఆశ్రయ కల్పిస్తుంది.

ఎన్నో అవార్డులు

చిన్నారుల ఆనంద నిలయం ద్వారా చేస్తున్న సేవలకు గాను నేషనల్ అవార్డ్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ అవార్డు–2011ను అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా మల్లాడి కృష్ణారావు అందుకున్నారు. సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకు గుర్తింపుగా 2012లో వయో శ్రేష్ఠ సమ్మాన్ అవార్డును అప్పటి కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్ షిండే చేతుల మీదుగా అందుకున్నారు.



యానాం ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులు

నేడు ఓల్డేజ్ హోమ్ రజతోత్సవ వేడుకలు

యానాం: యానాం ఓల్డేజ్ హోమ్ స్థాపించి 25 ఏళ్లు పూర్తి కావడంతో రజతోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఓల్డేజ్ హోమ్ వ్యవస్థాపకుడు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శనివారం తెలిపారు. కార్యక్రమానికి లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణతో పాటు గౌరవ అతిథిగా సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, కేంద్ర పీడబ్ల్యూడీ, కమర్షియల్ ట్యాక్స్ అధికారి ఎ.అన్నరుసు, వైజాగ్ ప్రొఫైల్స్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఈమండి శంకరరావు తదితరులు హాజరవుతారన్నారు.